ఏపీ రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

- బీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తోట చంద్రశేఖర్

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): మిజ్‌గాం తుఫాను ప్రభావంతో అతలాకుతలమైన ఏపీ రైతాంగాన్ని ఆదుకోవాలని బీఆర్ఎస్ ఆ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ తోట చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో చేతికొచ్చిన ధాన్యం, అరటి, జొన్న పంటలు నీట మునిగి వేలాది ఎకరాల్లో తీవ్ర నష్టం వాటిల్లిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎటువంటి నిబంధనలు లేకుండా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు. పూర్తిగా జలమయమైన లోతట్టు ప్రాంతాల ప్రజలకు పునరావాసం కల్పించి ప్రభుత్వం వారిని అన్ని విధాలుగా ఆదుకోవాలని పేర్కొన్నారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల్లో బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొనాలని తోట చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.

కమ్యూనిస్టుల గొంతుకగా పనిచేస్తా

- మంత్రివర్గంలో చేరటంపై ఆలోచిస్తాం: కూనంనేని

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): తాను సీపీఐ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటికీ.. అసెంబ్లీలో వామపక్ష పార్టీల ప్రతినిధిగా ఉంటానని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు చెప్పారు. అక్రమ కేసులు, ఉపా చట్టాలకు వ్యతిరేకంగా గొంతు వినిపిస్తానని, ప్రగతిశీల శక్తుల తరఫున నిలుస్తానని తెలిపారు. హైదరాబాద్ మఖ్దూంభవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ అస్థిత్వమే నిర్భంధాలు, అణచివేతలు, నిరంకుశత్వానికి వ్యతిరేకమని, నిజాం నవాబు క్రూర రాచరిక పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ రైతాంగ సాయుధ పోరాటాన్ని సాగించి తెలంగాణను విముక్తి చేసిందని గుర్తు చేశారు. కమ్యూనిస్టులు ఎటువైపు ఉంటే, అటు వైపు అధికారం వచ్చే అవకాశం ఉంటుందనేది స్పష్టమైందని అన్నారు. మంత్రివర్గంలో చేరాలని కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదిస్తే ఆలోచన చేసి నిర్ణయం తీసుకుంటామని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ చెప్పారు. ఈ సమావేశంలో సీపీఐ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటీ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటలో కురిసిన వానకు నేలవాలిన వరి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అంజనాపురంలో ధాన్యం తడవకుండా కప్పిన పరదాలు

నేడు, రేపు అత్యంత భారీ వర్షాలు

పలు జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ అలర్ట్ జారీ • అశ్వారావుపేటలో 96.8 మి.మీ. వర్షపాతం

- పత్తి, మిర్చి, వరి పంటలకు తీవ్ర నష్టం
- అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లకు సీఎస్ ఆదేశం
- ఖమ్మం జిల్లాలో నేడు విద్యాసంస్థలకు సెలవు

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ)/ నెట్‌వర్క్: మిజ్‌గాం తుఫాను ప్రభావంతో బుధ, గురువారాల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని ప్రకటించింది. జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, పెద్దపల్లి, జనగామ, నల్లగొండ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడతాయని వెల్లడించింది. ఈ నేపథ్యంలో వాతావరణశాఖ ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది. కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్‌భూపాలపల్లి, నల్లగొండ, జనగామ, కుమ్రంభీం ఆసిఫాబాద్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, మెదక్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది. గంటకు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నదని తెలిపింది. మంగళవారం ఉదయం నుంచి కొత్తగూడెం, ఖమ్మం, నాగర్‌కర్నూల్, నల్లగొండ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిశాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో 96.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

పత్తి, మిర్చి, వరి పంటలకు నష్టం

మిగ్‌జాం తుఫాన్ ప్రభావంతో పలు జిల్లాల్లో చేతికొచ్చిన పంటలు నీటి పాలయ్యాయి. ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో పత్తి, మిర్చి, వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పొలాల్లో వరి నేలకొరిగింది. కోసిన వరి మెదలు తడిసిపోయాయి. కల్లాల్లో ఆరబోసిన మిర్చి, ధాన్యం తడిసి ముద్దయ్యాయి. చేతికొచ్చిన పంటను కాపాడుకునేందుకు పరదాలు, టార్పాలిన్లు కప్పుతూ రైతులు జాగ్రత్త పడుతున్నారు. సత్తుపల్లి ఓపెన్ కాస్టులో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. వర్షాల కారణంగా బుధవారం ఖమ్మం జిల్లాలో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.

కలెక్టర్లతో సీఎస్ టెలికాన్ఫరెన్స్

ఎడతెరపిలేని వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లతో సీఎస్ శాంతికుమారి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాలకు ఒక్కొక్క ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపిస్తున్నామని తెలిపారు. చెరువులకు గండ్లు పడకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని కోరారు. వరదలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో కాజ్‌వే, లోతట్టు ప్రాంతాల వద్ద చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు వీలుగా పునరావాస కేంద్రాలను గుర్తించాలని ఆదేశించారు. కార్యక్రమంలో విపత్తుల నిర్వహణశాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- సీఎల్పీ నేత రేవంత్‌రెడ్డి సూచన

మిజ్‌గాం తుఫాను నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సీఎల్పీ నేత రేవంత్‌రెడ్డి కోరారు. ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలని, టార్పాలిన్ల పంపిణీపై దృష్టి పెట్టాలని సూచించారు. తుఫాను ప్రభావం ఎక్కువగా ఉన్న ఈశాన్య జిల్లాల్లో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని అన్నారు. లోతట్టు ప్రాంతాల్లో వరద ప్రవాహాన్ని ముందే అంచనా వేయాలని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అవసరమైన చోట పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు.

ఆర్సీరెడ్డికి జాతీయ ఉత్తమ రైతు అవార్డు

- టెక్నాలజీ వినియోగంలో ఆదర్శం
- జమ్మికుంట కేవీకే శాస్త్రవేత్త ప్రోత్సాహంతో ముందుకు
- 8న అవార్డు అందించనున్న ఐసీఏఆర్, కృషి జాగరణ్

జమ్మికుంట, డిసెంబర్ 5: కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గుండి గోపాల్‌రావుపేటకు చెందిన ఆదర్శ రైతు ద్యావ రామచంద్రారెడ్డిని జాతీయ ఉత్తమ మిలియనీర్ రైతు అవార్డు వరించింది. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి, కృషి జాగరణ్ సంయుక్తంగా ఏటా 'మిలీనియం ఫార్మర్స్ మీట్'లో ఉత్తమ రైతులకు అవార్డులను అందజేస్తుంది. అందులో భాగంగానే 'మిలీనియం ఫార్మర్స్ మీట్-2023' ఢిల్లీలో ఈ నెల 5 నుంచి 3 రోజులపాటు జరుగుతుంది. తెలంగాణ నుంచి నలుగురు రైతులు ఎంపికయ్యారు. అందులో జమ్మికుంట కేవీకే ఫార్మర్ ఆర్సీ రెడ్డి కూడా ఉన్నారు. రామచంద్రారెడ్డి 25 ఏండ్ల నుంచి వ్యవసాయం చేస్తున్నారు. సాగులో సరికొత్త మార్పులను ఆచరించి ముందుకు సాగుతున్నారు. జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం, ఉద్యాన శాస్త్రవేత్త వేణుగోపాల్ ప్రోత్సాహంతో బొప్పాయి, డ్రాగన్ ఫ్రూట్, మస్క్ మిలన్, లిచ్చి, ఊష్ణ ఆపిల్, వరి తదితర పంటలు సాగు చేస్తున్నారు. పంట దిగుబడులను 'ఆర్సీ రెడ్డి' బ్రాండుతో విక్రయిస్తున్నారు. ఈ అంశాలను పరిగణలోకి తీసుకున్న భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి, కృషి జాగరణ్ సంస్థలు ఆయనను జాతీయ ఉత్తమ రైతు అవార్డుకు ఎంపిక చేశాయి. ఈ నెల 8న ఆర్సీ రెడ్డి జాతీయ ఉత్తమ మిలియనీర్ రైతు అవార్డు అందుకోనున్నారు.

భార్యను పంచాయితీకి పిలవట్లేదని సర్పంచ్ అత్త హత్య

- 24 గంటల్లో హత్య కేసు ఛేదన
- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

ఇల్లందకుంట, డిసెంబర్ 5: భార్యను పంచాయితీకి పిలువట్లేదన్న కోపంతో మహిళా సర్పంచ్ కుటుంబంపై కక్ష పెంచుకున్న ఓ యువకుడు.. సర్పంచ్ అత్తను హత్య చేసి పరారయ్యాడు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం కనగర్తిలో సోమవారం కలకలం రేపింది. కేసును పోలీసులు 24 గంటల్లోనే ఛేదించి, నిందితుడిని అరెస్ట్ చేశారు. హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. కనగర్తికి చెందిన రామంచ కుమారస్వామికి వరంగల్ జిల్లా దామెర మండలం దేవాలకు చెందిన శ్రీలతతో 10 నెలల క్రితం వివాహం జరిగింది. కొన్ని రోజుల నుంచి తరచూ భార్యతో కుమారస్వామి గొడవపడేవాడు. వేధింపులు భరించలేక శ్రీలత పుట్టింటికి వెళ్లిపోయింది. 3 నెలల నుంచి కుమారస్వామి గ్రామ సర్పంచ్ రజిత ఇంటికెళ్లి తన భార్యను పంచాయితీకి పిలిపించాలని కోరుతున్నాడు. సర్పంచ్, ఆమె భర్త వాసుదేవరెడ్డి పట్టించుకోలేదు. సర్పంచ్ కుటుంబంపై కక్ష పెంచుకున్నాడు. ఆ కుటుంబాన్ని చంపాలని పథకం రచించి, జమ్మికుంటలో కత్తి కొనుగోలు చేశాడు. పంచాయతీ కార్యాలయం తలుపులను కాల్చితే సర్పంచ్ భర్త వాసుదేవరెడ్డి అక్కడికి వస్తాడని, అప్పుడు కత్తితో పొడిచి చంపవచ్చని భావించి తలుపులను కాల్చాడు. అక్కడికి ఎవరూ రాకపోవడంతో నేరుగా సర్పంచ్ ఇంటికి వెళ్లాడు. సర్పంచ్ రజిత అత్త లక్ష్మి (70) ఇంటి ముందు కూర్చొని ఉండగా.. ఆమెను కత్తితో పొడిచి పారిపోయాడు. కుటుంబ సభ్యులు ఆమెను జమ్మికుంటకు చికిత్స కోసం తరలిస్తుండగా లక్ష్మి మృతిచెందింది. వాసుదేవరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. జమ్మికుంట రూరల్ సీఐ కిశోర్, ఎస్సై రాజ్‌కుమార్ మంగళవారం నిందితుడిని పట్టుకొన్నారు.

విద్యా - ఉద్యోగ సమాచారం

6, 7, 8న యూజీసీ నెట్ ఎగ్జామ్స్

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : యూజీసీ నెట్ పరీక్షలు ఈ నెల 6, 7, 8న నిర్వహించనున్నారు. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) పద్ధతిలో జరిగే ఈ పరీక్షలకు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. పరీక్ష రాసే అభ్యర్థులు తమ అడ్మిట్‌కార్డులను https://ugcnet.nta.ac.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని యూజీసీ వర్గాలు సూచించాయి.

ప్రభుత్వంతో కలిసి ముందుకెళ్తాం: సీపీఎస్ఈయూ

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రాభివృద్ధి, ప్రజాప్రయోజనాల దృష్ట్యా నూతనంగా ఏర్పడే రాష్ట్రప్రభుత్వంతో సమన్వయం చేసుకొని ముందుకెళ్తామని తెలంగాణ స్టేట్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ (సీపీఎస్ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి నరేశ్ గౌడ్‌లు వెల్లడించారు. రెండు దశాబ్దాలుగా ఉద్యోగుల కలగా మారిన పాత పెన్షన్‌ను అమలు చేయాలని వారు కోరారు. అదేవిధంగా, కొత్తగా ఏర్పడనున్న రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ నాన్‌గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం (టీఎన్జీవో) శుభాకాంక్షలు తెలిపింది.

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వం: ఎన్సీటీఈ

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : టీచర్ల పదోన్నతులకు టెట్ నుంచి మినహాయించడం కుదరదని నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్సీటీఈ) స్పష్టంచేసింది. ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించేందుకు టెట్ అర్హతను తప్పనిసరిగా ప్రకటించింది. ఇటీవలే తెలంగాణ టీచర్ల పదోన్నతులు కల్పించేందుకు టెట్ అర్హత నిబంధన అడ్డంకిగా మారింది. దీంతో రాష్ట్ర విద్యాశాఖ గతంలో ఎన్సీటీఈకి లేఖ రాసింది. దీనిపై స్పష్టతనిచ్చిన ఎన్సీటీఈ, టెట్ ఉన్నవారికే పదోన్నతులు కల్పించాలని సూచించింది.

జాతీయ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్‌కు 14 ప్రాజెక్ట్‌లు

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : జాతీయ 31వ బాలల సైన్స్ కాంగ్రెస్‌కు రాష్ట్రం నుంచి 14 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. మంగళవారం అమీర్‌పేటలోని సెస్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎగ్జిబిషన్‌లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన 14 ప్రాజెక్ట్‌లను జాతీయస్థాయికి ఎంపికచేశారు. తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (టీఎస్‌కాస్ట్) ఆధ్వర్యంలో ఈ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో టీఎస్‌కాస్ట్ సభ్యకార్యదర్శి మారుపాక నగేశ్, విద్యాశాఖ జేడీ మదన్‌మోహన్, సెస్ డైరెక్టర్ రేవతి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థులు

ప్రాజెక్టులు రూపొందించిన 14 మంది విద్యార్థులు జాతీయస్థాయికి ఎంపికయ్యారు. వీరిలో టీ డార్విన్ బాలాజీ (ఖమ్మం), శివరాం బెనర్జీ(హైదరాబాద్), సీ సాయిక్రిష్ (కామారెడ్డి), భుక్యా సలోని (యాదాద్రి భువనగిరి), కే మహిధర్ (సూర్యాపేట), ఎం కీర్తి కౌశిక్(హనుమకొండ), ఎస్ అశ్వంత్ (సిద్దిపేట), సీహెచ్ బ్రాహ్మణి (వరంగల్), జే శివమణి (నాగర్‌కర్నూల్), జీవన్ నాన్‌జీష్ (మహబూబ్‌నగర్), పీ వినీల (రాజన్న సిరిసిల్ల), ఇన్నేశ్ చీకటిమార్ల (రంగారెడ్డి), ఎం సుమిత్ (నిర్మల్), కే రుగ్వేద్ (కరీంనగర్)లు ఎంపికయ్యారు.

వర్సిటీల్లో అంబుడ్స్‌పర్సన్స్ : యూజీసీ

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : దేశంలోని అన్ని వర్సిటీల్లో ఫిర్యాదుల పరిష్కారానికి ఈ నెల 31లోపు అంబుడ్స్‌పర్సన్స్‌ను నియమించాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) కార్యదర్శి మనీష్‌జోషి ఆదేశించారు. సెంట్రల్ వర్సిటీలు, స్టేట్, డీమ్డ్, ప్రైవేట్ యూనివర్సిటీలన్నింటిలోనూ అంబుడ్స్‌పర్సన్స్‌ను నియమించాలని సూచించారు. లేనిపక్షంలో ఆయా వర్సిటీలపై చర్యలుంటాయని హెచ్చరించారు.

జపాన్‌లో నర్సింగ్ ఉద్యోగాలకు 7న స్క్రీనింగ్ టెస్ట్

హైదరాబాద్, డిసెంబర్ 5(నమస్తే తెలంగాణ) : జపాన్‌లో నర్సింగ్ ఉద్యోగాల నియామకానికి ఈ నెల 7న హైదరాబాద్ శివంరోడ్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్కిల్ ట్రైనింగ్ (ఎన్ఎస్‌టీఐ) ప్రాంగణంలో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నట్టు తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్) మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. 22 నుంచి 30 ఏండ్ల వయస్సు ఉండి, బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం డిప్లొమా పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఎంపికైన అభ్యర్థులకు ముందుగా జపనీస్ భాషపై రెసిడెన్షియల్ శిక్షణ ఉంటుందని తెలిపింది. వివరాలకు టామ్‌కామ్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరింది.

రూర్బన్ మిషన్ కింద తెలంగాణలో 1,425 పనులు

- ఎంపీ రంజిత్‌రెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): శ్యామాప్రసాద్ ముఖర్జీ రూర్బన్ మిషన్ కింద తెలంగాణలో 1,425 పనులు జరుగుతున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. రూర్బన్ మిషన్ అమలు తీరు, నిధుల ఖర్చుపై లోక్‌సభలో బీఆర్ఎస్ ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి సాధ్వీ నిరంజన్ జ్యోతి సమాధానమిస్తూ.. తెలంగాణలోని 17 క్లస్టర్లలో ఈ పనులు జరుగుతున్నట్టు తెలిపారు. వికారాబాద్ జిల్లాలోని అల్లాపూర్ ఎస్ క్లస్టర్‌లో 80 పనులు జరుగుతున్నట్టు చెప్పారు. మొత్తంగా 1,425 పనులకు అవసరమైన నిధులు మంజూరు చేశామని, ఈ నెలాఖరుకు పనులు పూర్తవుతాయని వివరించారు.

10 నుంచి తెలుగు రాష్ట్రాల్లో ఆటా వేడుకలు

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): ఏపీ, తెలంగాణలో అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) వేడుకలను ఈ నెల 10 నుంచి 30 వరకు నిర్వహించనున్నట్టు ఆటా వేడుకల చైర్మన్ జయంత్ చల్లా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే జూన్ 7, 8, 9న ఆటా అంతర్జాతీయ సదస్సు అమెరికాలో జరుగనున్న నేపథ్యంలో ముందుగా తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. వేడుకల్లో విద్యా, వ్యాపార, ఆధ్యాత్మిక సెమినార్లు, ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. హైదరాబాద్, శ్రీశైలం, బాసర, నల్లగొండ, వరంగల్, గజ్వేల్, వైజాగ్, తిరుపతి, విజయవాడ నగరాల్లో వేడుకలకు ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. ఆటా సంస్థ, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ, బాసర ఐఐఐటీ, ఏయూ, తెలంగాణ ఉన్నత విద్యాశాఖ, పలు ఎన్జీఓల భాగస్వామ్యంతో కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

డ్రైవర్ పక్క సీటు వ్యక్తి ప్రమాదానికి కారణమా?

- మృతుడి కుటుంబానికి వడ్డీతో కలిపి పరిహారం చెల్లించాల్సిందేనన్న హైకోర్టు

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): కారు డ్రైవర్ పక్క సీటులో కూర్చున్న వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మరణిస్తే, అతనికి నిర్లక్ష్యాన్ని ఆపాదించలేమని హైకోర్టు స్పష్టం చేసింది. డ్రైవింగ్ నిర్లక్ష్యానికి అతను ఎలా కారణమవుతాడని ప్రశ్నించింది. ఈ ప్రమాదంలో మృతుడికి నిర్లక్ష్యాన్ని ఆపాదిస్తూ అతని కుటుంబానికి పరిహారాన్ని తగ్గించడంచెల్లదని తేల్చిచెప్పింది. మృతుడి కుటుంబానికి పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించాల్సిందేనని న్యూ ఇండియా అష్యూరెన్స్ బీమా సంస్థను ఆదేశించింది. 2013లో రోడ్డు ప్రమాదంలో భర్తను కోల్పోయిన తనకు ప్రమాద బీమా పరిహారాన్ని తగ్గిస్తూ మోటర్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ ఉత్తర్వులు ఇవ్వడం చెల్లదంటూ మెదక్‌కు చెందిన ఏ సత్యవతి, మరొకరు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ పీ శ్యాంకోశీ, జస్టిస్ ఎన్ తుకారాంజీ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. మృతుడి కుటుంబానికి చెల్లించాల్సిన రూ.29 లక్షల పరిహారంలో ఇప్పటికే కొంత చెల్లించినట్టయితే మిగిలిన మొత్తాన్ని పదేండ్ల వడ్డీతో కలిపి చెల్లించాలని బీమా సంస్థకు ఉత్తర్వులు జారీచేసింది.

భారీగా నకిలీ మందులు సీజ్

- పట్టుబడ్డ ఔషధాల విలువ రూ.4.35 కోట్లు
- ఆస్ట్రికా హెల్త్‌కేర్ కంపెనీపై డీసీఏ దాడులు
- 2021 జూలైలోనే కంపెనీకి అనుమతులు రద్దు
- గుట్టుగా నకిలీ ఔషధాలు తయారు చేస్తున్న సంస్థ
- పరారీలో కంపెనీ డైరెక్టర్ సతీశ్‌రెడ్డి

డీసీఏ అధికారులు స్వాధీనం చేసుకున్న నకిలీ ఔషధాలు

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): నకిలీ క్యాన్సర్ ఔషధాల తయారీ రాకెట్‌ను డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు ఛేదించారు. రూ.4.35 కోట్ల విలువైన నకిలీ ఔషధాలను సీజ్ చేశారు. 'ఆస్ట్రిక హెల్త్ కేర్' అనే సంస్థ క్యాన్సర్ నివారణకు ఉపయోగించే ఔషధాలను నకిలీ, కల్తీవి తయారు చేసి మార్కెట్‌లో అమ్ముతున్నట్టు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఈ నెల 2న విజిలెన్స్ బృందాలు తనిఖీలు నిర్వహించినట్టు డీసీఏ డైరెక్టర్ జనరల్ కమలాసన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే, ఔషధాలకు సంబంధించిన ఇన్వాయిస్‌లపై అల్వాల్ చిరునామా ఉన్నదని, అక్కడికి వెళ్లి తనిఖీ చేయగా తప్పుడు అడ్రస్‌గా తేలిందని తెలిపారు. అనంతరం ఈ నెల 4న ఒక బృందం ఐడీఏ చర్లపల్లి, నాచారం, మేడ్చల్‌లోని వివిధ కొరియర్ కార్యాలయాలకు వెళ్లి తనిఖీలు చేపట్టగా, మరో బృందం కీసరలోని ఆస్ట్రిక హెల్త్ కేర్ సంస్థలో తనిఖీలు నిర్వహించినట్టు వెల్లడించారు. కంపెనీ నుంచి నకిలీ ఔషధాలను తీసుకెళ్తున్న కొరియర్ బాయ్‌ని గుర్తించడంతో మచ్చబొల్లారంలోని మూడు షట్టర్లలో నిల్వ చేసిన నకిలీ మందులు బయటపడ్డాయని వివరించారు.

రెండేండ్ల కిందటే లైసెన్స్ రద్దు

ఆస్ట్రిక హెల్త్‌కేర్ కంపెనీ లైసెన్స్‌ను 2021 జూలైలోనే ప్రభుత్వం రద్దు చేసిందని డీసీఏ డైరెక్టర్ జనరల్ తెలిపారు. అయినా కంపెనీలో పెద్ద ఎత్తున ఔషధాలు తయారు చేసి అమ్ముతున్నారని పేర్కొన్నారు. తయారీ తేదీని 2023 మార్చిగా ముద్రించారని వెల్లడించారు. మందుల లేబుల్స్‌పై ఆస్ట్రా జెనెరిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ అని ముద్రించారని, అసలు అలాంటి కంపెనీయే లేదని చెప్పారు. మొత్తం 36 రకాల క్యాన్సర్ నివారణ ఔషధాలు, ఇతర మందులను స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ రూ.4.35 కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. కేసులో ప్రధాన సూత్రధారి ఆస్ట్రికా హెల్త్ కేర్ డైరెక్టర్ కే సతీశ్‌రెడ్డి ప్రస్తుతం పరారీలో ఉన్నాడని వెల్లడించారు. మొత్తం 9 కంపెనీల పేర్లతో నకిలీ ఔషధాలను తయారుచేసినట్టు గుర్తించారు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే ఇదే అతిపెద్ద నకిలీ క్యాన్సర్ ఔషధాల రాకెట్ అని పేర్కొన్నారు. నకిలీ ఔషధాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వీటివల్ల ఆరోగ్యం మెరుగుపడకపోగా, మరింత క్షీణిస్తుందని చెప్పారు. ఈ ఆపరేషన్‌లో అడిషనల్ డైరెక్టర్లు పీ రాము, వీ బాలనగంజన్, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు జీ శ్రీకాంత్, కే అన్వేశ్, ఎం చంద్రశేఖర్, వీ అజయ్, ఎస్ వినయ్‌సుష్మీ, కే మురళీకృష్ణ, బీ ప్రవీణ్, ఎన్ రవికిరణ్‌రెడ్డి, ఏఎన్ క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఔషధాలపై ముద్రించిన కంపెనీల పేర్లు

- ఆస్ట్రా జెనెరిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, తెలంగాణ
- ఆస్ట్రిక హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్, తెలంగాణ
- బ్లెస్ ఫార్మా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, తెలంగాణ
- అలయన్స్ బయోటెక్, హిమాచల్‌ప్రదేశ్
- సన్వెట్ హెల్త్‌కేర్, హిమాచల్‌ప్రదేశ్
- సాలస్ ఫార్మాస్యూటికల్స్, హిమాచల్‌ప్రదేశ్
- డీఎం ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్, హిమాచల్‌ప్రదేశ్
- మీడియాన్ బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్, హిమాచల్‌ప్రదేశ్
- సేఫ్ పేరెంటల్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఆంధ్రప్రదేశ్

ఆరంభించు వారు
Apollo DIAGNOSTICS
&
Horlicks Women's PLUS
సుమారు 90% మహిళలకి విటమిన్ డి లోపం ఉంది. ఇది ఎముకల సాంద్రత నష్టానికి దారితీయవచ్చు
విటమిన్ డి పరీక్షలు
₹1850 కేవలం ₹199 కే పొందండి
ఏదేని అపోలో డైగ్నోస్టిక్స్ పేషెంట్ కేర్ సెంటర్ లేదా అపోలో క్లినిక్ కి విచ్చేసి పరీక్ష చేయించుకోండి
మరిన్ని వివరాలక